సాక్షి
మెదక్
సోమవారం । 5 । జూన్ । 2023



'అల్లం' సాగుపై ఆసక్తి
ఐదేళ్ల విరామం తర్వాత అల్లం సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో అల్లం పంట విస్తారంగా సాగవుతోంది. 8లో



మహా వృక్షానికి నిప్పు..
మహా వృక్షానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన సంఘటన చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. 8లో



ఘనంగా ఏరువాక పౌర్ణమి
మండలంలో రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. బహిరన్‌దిబ్బ, చిల్వెర, అల్లాదుర్గం, మాందాపూర్, చెవేళ్ల రైతులు ఎద్దులను రంగు రంగులతో అలంకరించారు. 9లో

అన్నదాతల 'అప్పు' గోస

- రుణమాఫీ అవుతుందని అప్పుకట్టని రైతులు
- బ్యాంకుల్లో పేరుకుపోతున్న వడ్డీలు
- జిల్లాలో 27,809 మంది క్రాప్‌లోన్ పెండింగ్
- ఇబ్బందుల్లో రైతన్నలు



మెదక్‌జోన్: తాము రెండో సారి అధికారంలోకి రాగానే రూ. లక్ష లోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో రూ.25 వేల వరకు రుణాలను మాఫీ చేసింది. ఆపై ఉన్న మొత్తాన్ని నేటికీ మాఫీ చేయలేదు. దీంతో వేలాది మంది రైతుల తాము తీసుకున్న అప్పుకు వడ్డీలు పేరుక పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రైతులు బ్యాంకులకు వెళ్లలేని పరిస్థితి జిల్లాలో నెలకొంది.

- మెదక్ జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటిలో సుమారు 3 లక్షల పైచిలుకు ఎకరాల్లో 48,682 మంది రైతులు సాగు చేస్తున్నారు. వారు వ్యవసాయనికి వివిధ బ్యాంకుల్లో రూ. 274.54 కోట్లు వరకు అప్పులు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు.
- కాగా ప్రభుత్వం 2018 ఎన్నికల సమయంలో తాము మళ్లీ అధికారంలోకి వస్తే రూ. లక్ష వరకు అప్పులు ఏకకాలంలో మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది.
- ఇందులో భాగంగా రూ.25 వేల లోపు అప్పులు ఉన్న రైతులకు మాత్రమే మాఫీ చేసింది.
- జిల్లాలో రూ.25 వేల లోపు అప్పులు తీసుకున్న 20,873 మంది రైతులకు సంబంధించి రూ.82.38కోట్లు మాఫీ చేసింది.
- ఈ లెక్కన చూస్తే రూ.25 వేల పైబడి అప్పులు తీసుకున్న రైతులు 27,809 మంది ఉన్నారు. వీరికి సంబంధించి రూ.192.16 కోట్ల వరకు అప్పులు బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్నాయి.
- ఏళ్ల తరబడి బ్యాంకుల్లో పేరుకుపోవడంతో రైతులు ఆ బ్యాంకులకు వెళ్లలేని దుస్థితి నెలకొంది.
- ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడంతోనే రైతులు తమ పెండింగ్ రుణాలు కట్టలేమని చెబుతున్నారు.
- బ్యాంకులకు అప్పు ఉన్నరైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే బ్యాంకుల్లో అప్పుకింద ఆ మొత్తాన్ని జమకట్టుకుంటారనే భయంతో తమ ధాన్యాన్ని ఇతర ప్రైవేట్ వ్యాపారులకు తరలిస్తున్నారు.

మోసపోతున్న రైతులు

- బ్యాంకర్లు డబ్బులు పట్టుకుంటారనే భయంతో 40శాతం మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు.
- గతేడాది చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల రైతులు అంబాజీపేట గ్రామానికి చెందిన ఓ ప్రైవేట వ్యాపారికి ధాన్యం విక్రయించారు.
- ధాన్యం విక్రయించి నేటికి ఏడాది అవుతున్నా సదరు వ్యాపారి రైతులకు నేటికి డబ్బులు ఇవ్వలేదు.
- ప్రభుత్వం రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకపోవడంతోనే అన్నదాతలు బ్యాంకులకు వెళ్లలేని దుస్థితి నెలకొంది.

రూ. 1.50 లక్షలు ఇవ్వాలి



గతేడాది వానాకాలం వడ్లు సుమారు 75 క్వింటాళ్ల ధాన్యాన్ని అంబాజీపేటకు చెందిన ఓ వ్యాపారికి క్వింటాల్‌కు రూ. 2వేల చొప్పున విక్రయించాను. బ్యాంకులో అప్పు కిందకు డబ్బులు జమకుంటారనే భయంతో ప్రైవేట్ వ్యాపారికి విక్రయించాల్సి వచ్చింది. దీంతో అతను నేటికి డబ్బులు ఇవ్వలేదు.
లక్ష్మణ్, రైతు, జంగారాయి

రెన్యూవల్ చేసుకోవాలి

రైతులు ప్రతిఏటా పంటరుణాలు రెన్యూవల్ చేసుకోవాలి. ఏడాది లోపల రెన్యూవల్ చేసుకుంటే 7% వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అందులో 4% వడ్డీని తిరిగి రైతు ఖాతాలో ప్రభుత్వం జమకడుతుంది. అంటే రైతుకు కేవలం 3 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాల్సి ఉంది. లేదా వడ్డీకి చక్రవడ్డీ అవుతుంది. ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు సదరు రైతుకు చెల్లిస్తాం. రెన్యూవల్ చేస్తే రుణమాఫీ కాదనే అనుమానం పెట్టుకోవద్దు. **- ఫిలిప్స్ లీడ్‌బ్యాంకు మేనేజర్ మెదక్ జిల్లా**

నేడు విద్యుత్ విజయోత్సవం

కలెక్టర్ రాజర్షిషా



మెదక్ కలెక్టరేట్: విద్యుత్ విజయోజత్సవం, సురక్ష దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ఆది వారం తెలిపారు. పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ విజయోత్సవ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నట్లు చెప్పారు. నర్సాపూర్‌లో సాయి కృష్ణ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వినియోగదారులు, విద్యుత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు. విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతి, గుణాత్మక మార్పులపై వివరణ, సాధించిన విజయాలపై ప్రచురించిన కరపత్రాలు, పుస్తకాల పంపిణీ ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్లను విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ప్రతి గ్రామంలో ఆకర్షణీయమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు కలెక్టర్ సూచించారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు రాందాస్ చౌరస్తా నుంచి వైస్రాయ్ గార్డెన్ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో బైకులు, కార్లు తదితర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం వైస్రాయ్ గార్డెన్‌లో నిర్వహించే సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

మెదక్ కలెక్టరేట్: నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారని నోడల్ అధికారి సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు మెదక్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. థియరీ పరీక్షలు 12 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతీరోజు ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ ఉంటుందన్నారు. మొత్తం 6,681 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యుల్డు కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో పదోతరగతిలో 7.0 జీపీఏ కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ ఈపాస్ నందు దరఖాస్తు చేసుకొనేందుకు ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ వరకూ గడువు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, ఆశ్రమ ప్రభుత్వ వసతి గృహాల్లో, కేజీబీవీ పాఠశాలల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించి ఎంపికైన విద్యార్థులకు అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీలను జిల్లా షెడ్యుల్డు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఇస్తామని తెలిపారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న నారాయణగుప్తా

తూప్రాన్: ఈ నెల 6 నుంచి 8 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో జరిగే జాతీయ స్థాయి మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ కోడిప్యాక నారాయణ గుప్తా ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి అండర్ 11 బాలికల జట్టుకు నీహారిక, నవ్య శ్రీ,, అండర్ 13కు దివ్య, అండర్ 13 బాలుర జట్టుకు విఘ్నేష్, హేమంత్ కుమార్‌గౌడ్‌లు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం క్రీడాకారులను సన్మానించి అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్‌శర్మ పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం డబ్బులు ఎప్పుడిస్తారు ?

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కాంటాచేసి నెల రోజులు గడుస్తున్నా రైతులకు ధాన్యం డబ్బులు ఎప్పుడిస్తారో చెప్పాలని బీజేపీ సీనియర్ నాయకుడు, చిన్నశంకరంపేట మాజీ జెడ్పీటీసీ సురేందర్‌నాయక్ ప్రశ్నించారు. ఆదివారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజల సొమ్మును వృథా చేస్తున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమి లేదని ప్రశ్నించారు. కాంటా వేసిన రెండు రోజుల్లోనే డబ్బులను రైతు ఖాతాలో జమ చేస్తామని చెప్పి నేటికీ డబ్బులు జమకాకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం డబ్బులను రైతులఖాతాల్లో జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎస్ఐ ఇన్‌చార్జి బిషప్‌పై చర్యలు తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: మాల మాదిగలను కించపరుస్తూ మాట్లాడిన మెదక్ సీఎస్ఐ చర్చి ఇంచార్జ్ బిషప్ పద్మారావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి

నర్సాపూర్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ భవన నిర్మాణానికి భూమి పూజ, బహిరంగ సభ విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి కోరారు. నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో పర్యటించి ముదిరాజ్ కులస్తుల మండల కమిటీ ప్రతినిధులను కలిసి బహిరంగ సభకు ఆహ్వానిస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా ఈనెల 5న ముదిరాజ్ భవన నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేస్తారని, ముదిరాజ్ మహాసభ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

భగలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పౌర్ణమి పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): భగలాముఖిని భక్తితో కొలవడం వల్ల ప్రతి మనిషికి శక్తిని ప్రసాదిస్తుందని భగలాముఖి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, ట్రస్టు సభ్యులు, హై కోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గూడూర్ గ్రామానికి చెందిన శివకుమార్‌గౌడ్, సూర్యకుమార్‌గౌడ్‌లు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కస్టమ్ అధికారి సురేందర్‌చారి, ప్రముఖ వ్యాపార వేత్త మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



రాజగోపురం ఎదుట భక్తుల రద్దీ

మల్లన్న నామస్మరణతో మారుమోగిన కొమురవెల్లి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తుల రాకతో సందడిగా మారాయి. మల్లనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. సుమారు 10 వేల మంది భక్తు లు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆలయ, ప్రయివేటు వసతి గదుల్లో బసచేశారు. ఉదయం స్వామివారి పుష్కరిణిలో స్నానమాచరించి, అభిషేకాలు, పటాలు, ఒడిబియ్యం, అర్చనలు, కేశఖండన, గంగరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన రేణుక ఎల్లమ్మకు బోనం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బాలాజీ, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్‌లు పర్యవేక్షించారు.

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



ప్రార్థనచేస్తున్న భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబెటరి ఇంచార్జ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దైవసందేశ మిచ్చారు. కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



దైవ సందేశమిస్తున్న శాంతయ్య

నేడు జిల్లాలో మంత్రి హరీశ్‌రావు పర్యటన

మెదక్ మున్సిపాలిటీ: మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం మెదక్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందులో భాగంగా పాపన్నపేట మండలం ఏడుపాయల్లో యాగశాల, పాపన్నపేట మండల కేంద్రంలో వెటర్నరి బిల్డింగ్, సీసీ రోడ్లు, కొత్త లింగాయపల్లి పంచాయతీ బిల్డింగ్‌ను ప్రారంభించి, రాంతీర్థంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్దిదారులకు అందజేస్తారు. మెదక్ పట్టణంలో మహిళా సమాఖ్య బిల్డింగ్‌కు శంకుస్థాపన, డీసీసీబీ బ్యాంక్ నూతన బిల్డింగ్ ప్రారంభించనున్నారు. అనంతరం పీఆర్టీయూ సమావేశం, ముదిరాజ్ భవనానికి శంకుస్థాపన, బహిరంగ సభల అనంతరం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సురక్ష దినోత్సవంలో హాజరవుతారు.

నేడు సురక్షా దినోత్సవం

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో నిర్వహించే సురక్షా దినోత్సవం వేడుకలను విజయవంతం చేయాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలో మెదక్ పట్టణంతో పాటు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే అతిథులందరికీ, ప్రజా ప్రతినిధులకు, పోలీస్ సిబ్బందికి, బడాఖాన వైస్రాయ్‌గార్డెన్‌లో ఏర్పాటు చేశారన్నారు.

నాచగిరిలో భక్తుల సందడి



సత్యనారాయణస్వామి వ్రతమాచరిస్తున్నభక్తులు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి ఆదివారం వారాంతపు సెలవురోజు భక్తులతో పోటెత్తింది. శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధానంలో మొక్కులు, పూజా కార్యక్రమాలతో అలరారింది. ఉమ్మడి మెదక్ జిల్లా, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కల్యాణం, నిజాభిషేకం మొక్కులు తీర్చుకున్నారు. వ్రత మండపంలో దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతమాచరించారు. గర్భగుడిలో స్వామి వారిని దర్శించుకుని, కట్నకానుకలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు. క్షేత్రంలో 10 కల్యాణాలు, 25 అభిషేకాలు, 60 సత్యనారాయణ వ్రతాలు జరగగా, 4500 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్ తెలిపారు.

సంస్కృతిని పరిరక్షించుకోవాలి



సింగపూర్‌లో అలయ్ బలయ్ కల్చరల్ సొసైటీ సభ్యులు

అలయ్ బలయ్‌లో సొసైటీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని సింగపూర్‌లోని తెలంగాణ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సింగపూర్‌లోని తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ బలగం అలయ్ బలయ్‌ను పుంగోల్‌పార్క్‌లో ఆదివారం నిర్వహించినట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటలను పిల్లలకు పరిచయం చేసే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అష్టచెమ్మ, పచ్చీస్, కచ్చకాయలు, గోలీలాట, తొక్కుడుబిల్ల, ఖోఖో, కర్రబిల్ల ఆడించారు. గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. అనంతరం పల్లెటూరి వంటలతో పచ్చిపులుసు, సర్వపిండి, సల్లచారు వంటి వంటలతో భోజన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు రమేశ్‌బాబు, కోశాధికారి సంతోష్‌కుమార్, శశిధర్‌రెడ్డి, సంతోష్‌వర్మ, రాధికరెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ వాసులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న చిన్నారులు

ఏడుపాయలకు పోటెత్తిన భక్తజనం



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

పాపన్నపేట(మెదక్): వన దుర్గా నమోస్తుతే అంటూ వేలాది భక్తులు ఆదివారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్నారు. తెల్లవారు జామున పూజారులు శంకరశర్మ, పార్థివశర్మలు అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేలాది భక్తులు డప్పుచప్పుళ్లతో బోనాలు సమర్పించుకున్నారు. ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. చెట్ల క్రింద విందులు చేసుకొని సందడి చేశారు. భక్తులకు ఇబ్బది కలుగకుండా ఇఓ సారశ్రీనివాస్, ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

యాగశాల సందర్శన

పాపన్నపేట(మెదక్): జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం సాయంత్రం ఏడుపాయల్లోని యాగశాలను సందర్శించారు. నూతనంగా నిర్మించిన యాగశాలను ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సోమవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలను ఆర్డీఓ, డీఎస్పీ, ఈఓలకు సూచించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ ఉద్యోగులు, పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట ఇఫ్కో చైర్మన్ దేవెందర్‌రెడ్డి, ఆర్డీఓ సాయిరాం, డీఎస్పీ సైదులు, ఈఓ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ



పాపన్నపేట: మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

క్లుప్తంగా

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

నిజాంపేట(మెదక్‌): చెరువులో దూకి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన నిజాంపేట మండలంలోని కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కల్వకుంట గ్రామానికి చెందిన బక్కబావి పోశవ్వ(65) భర్త మృతిచెందడంతో ఒంటరిగా ఉంటుంది. దీంతో ఆమె భర్తను గుర్తుతెచ్చుకుంటూ మానసికంగా బాధపడేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఐనా ఆమె జాడ కనిపించలేదు. దీంతో ఆదివారం ఉదయం గ్రామ పరిధిలోని నారాయణ చెరువులో గుర్తుతెలియని మృతదేహం కనిపించినట్టు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి చూడగా బక్కబావి పోశవ్వగా కుటుంబ సభ్యులు గుర్తించారు. కుటుంబ సభ్యులు బక్కబావి మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

నంగునూరు(సిద్దిపేట): బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం రాజగోపాల్‌పేటలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజగోపాల్‌పేట మధిర గ్రామం తత్తరి గుడిసెలుకు చెందిన పూస లక్ష్మి (45) ఉదయం ఇంట్లో గొడవ జరగడంతో బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతకగా గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో రాత్రి మృతదేహం లభించింది. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుండంలో పడి వృద్ధుడు..

తూప్రాన్‌: గుండంలోపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మృతుని వద్ద లభించిన ఆధార్‌ కార్డు ప్రకారం చేప్యాలకు చెందిన చిట్టిమిల్ల నర్సింలు(75) అంగవైకల్యంతో భిక్షాటన చేసేవాడు. గత కొన్నాళ్లుగా తూప్రాన్‌లో సంచరిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఉదయం రామాలయం పక్కన ఉన్న గుండంలో కాలు జారి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో మేక..



చేగుంట(తూప్రాన్‌): విద్యుత్‌ షాక్‌తో మేక మృతి చెందిన సంఘటన మండలంలోని మక్కరాజీపేటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చెన్నబోయిన నందుకు చెందిన మేకలు మేతకు వెళ్లగా సమీప పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ ఎర్తు కేబుల్‌కు విద్యుత్‌ షాక్‌ రాగా మేక మృతి చెందింది. మేక మృతితో దాదాపు రూ. 10వేల నష్టం వాటిల్లిందని నందు తెలిపాడు. బాధితుడికి విద్యుత్‌ అధికారులు న్యాయం చేయాలని సర్పంచ్‌ శ్రీనివాస్‌ కోరారు.

పిడుగుపడి గడ్డివాము దగ్ధం



గుజిరితండాలో గడ్డివాము మంటలను ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): పిడుగు పడటంతో గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని గుజిరితండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా పిడుగు పడి తండాకు చెందిన రామావత్‌ చంద్రియ నాయక్‌ చెందినా 100 వరి గడ్డిమోపులు దగ్ధం అయ్యాయి. ఈ విషయం తెలియడంతో ఫైర్‌ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. ఆర్‌ఐ మిస్‌బావొద్దీన్‌, పోలీస్‌ సిబ్బంది వివరాలు సేకరించారు. సర్పంచ్‌ రాకేశ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అల్లం' సాగుపై ఆసక్తి

- మార్కెట్లో డిమాండ్‌ ఉండటంతో మొగ్గు
- గణనీయంగా పెరగనున్న పంట సాగు విస్తీర్ణం
- సాగు కోసం భారీగా పెట్టుబడులు



పొలంలో నాటేందుకు సిద్ధం చేసిన అల్లం విత్తనం



భూమిలో అల్లం విత్తనం నాటుతున్న కూలీలు

జహీరాబాద్‌: ఐదేళ్ల విరామం తర్వాత అల్లం సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో జహీరాబాద్‌ ప్రాంతంలోనే అల్లం పంట విస్తారంగా సాగవుతోంది. మే మొదటి వారం నుంచి జూన్‌ నెలాఖరు వరకు అల్లం పంటను సాగు చేసేందుకు అనువుగా ఉంటుంది. ఐదు సంవత్సరాలుగా అల్లంకు మార్కెట్లో డిమాండ్‌ లేక పోవడంతో రైతులు క్రమంగా సాగుపై విముఖత చూపుతూ వచ్చారు. దీంతో పంట సాగు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్‌ ఉంది. ధర కూడా అధికంగా ఉంది. క్వింటాల్‌ రూ.10వేల నుంచి రూ. 12 వేలు పలుకుతోంది. వచ్చే ఏడాది కూడా ఇదే ధర పలికే అవకాశం ఉందనే ఉద్దేశంతో రైతులు అల్లం పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుస్తున్నారు.

- జహీరాబాద్‌ డివిజన్‌ పరిధిలోని కోహీర్‌, న్యాల్‌కల్‌, ఝరాసంగం, జహీరాబాద్‌, మొగుడంపల్లి, రాయికోడ్‌ మండలాల్లో అల్లం పంట సాగు చేస్తున్నారు. ఆయా మండలాల్లో ఎర్ర నేలలు, పాడు నేలలు ఉండడంతో అల్లం పంట సాగుకు అనువుగా ఉన్నాయి.
- కొందరు రైతులు నల్లరేగడి భూముల్లోనే పంట సాగు చేస్తున్నారు. ఎకరం భూమిలో అల్లం పంటను సాగు చేయడం కోసం సేంద్రీయ ఎరువులు, రసాయన ఎరువులు, విత్తనం, యాజమాన్య పద్ధతులను పాటించడం కోసం సుమారు రూ.1.50 లక్షల మేర వ్యయం చేయాల్సి ఉంటుంది.

దుంపకుళ్లు తెగుళ్లు

- అల్లం పంటకు దుంపకుళ్లు తెగుళ్లు సోకుతుంది. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 30 నుంచి 60% వరకు పంట నష్టం జరిగే ప్రమాదం ఉంది.
- ఈ తెగుళ్లు ఎక్కువగా అధికంగా వర్షాలు పడడం వల్ల, పంటలో నీరు నిలిచే పరిస్థితులలో ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధిని వ్యాపింపజేసే శిలీంద్రాలు భూమిలో, కొమ్మలపై జీవించి నీటి పారుదల ద్వారా పంట మొత్తానికి వ్యాప్తి చెందుతుంది.
- ఈ తెగుళ్ల ఆశించిన దుంపలు మెత్తగా అవుతాయి. తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు ఎండి పడిపోతాయి. దుంపలు నిల్వచేసే సమయంలో కూడా ఈ తెగుళ్ల ఉధృతి పెరిగి కుళ్లిపోతాయి. ఈ తెగుళ్లు సోకిన దుంపలను ఈగ కూడ ఆశిస్తుంది.

ఐదేళ్లుగా లభించని ధర

- ఐదేళ్లు అల్లం పంటకు మార్కెట్లో ఆశించిన ధరలేదు. దేశ వ్యాప్తంగా విస్తారంగా సాగులో ఉండమే ఇందుకు కారణం. ధర లేని కారణంగా అల్లం పంట జిల్లాలో వేయి ఎకరాలకు పడిపోయింది. ఏటా సుమారు 3 నుంచి 5 వేల ఎకరాల మేర అల్లం పంట సాగవుతూ వచ్చేది.
- ఐదు సంవత్సరాల కాలంగా మార్కెట్లో ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలయ్యారు. పంటను భూమిలో నుంచి తీసి మార్కెట్‌కు తరలించినా పంటను తీసిన ఖర్చులు కూడా రాని పరిస్థితి. గత ఏడాది రైతులు చేతికి అంది వచ్చిన పంటను భూమిలోనే దున్నివేశారు. ఫలితంగా నష్టాల పాలయ్యారు.

తగిన జాగ్రత్తలు పాటించాలి



అల్లం పంటను నాటే సమయంలో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. ఇలా చేయడం వల్ల తెగుళ్లకు చెక్‌ పెట్టొచ్చు. ఇతర పంటల లాగే అల్లం పంటకు కూడ తెగుళ్లు, చీడ పీడల బెడద ఉంటుంది. అల్లం పంటకు దుంపకుళ్లు, ఈగ, మొక్క తొలుచు పురుగు ప్రధానంగా వస్తుంటాయి. వీటిని నివారించేందుకు సకాలంలో సస్యరక్షణ చేపట్టాలి. దీంతో పంట దిగుబడులను ఆశించిన మేర పెంచుకోవచ్చు. అవసరం మేరకు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంట నాణ్యవంతంగా వస్తుంది. సకాలంలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను పాటించకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పంటకు తెగుళ్లు సోకినట్లయితే మమల్ని సంప్రదిస్తే తగిన సూచనలు అందిస్తాం.

–ఎస్‌.స్నేహలత,
డీడీఎస్‌–కేవీకే శాస్త్రవేత్త, జహీరాబాద్‌

మంత్రిని కలిసిన మాజీ ఏఎంసీ చైర్మన్‌



మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న నాగభూషణం

జోగిపేట(అందోల్‌): రాష్ట్ర ఆర్థిక, వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును జోగిపేట మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ డీబీ నాగభూషణం ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు.


శభాష్‌ నాందేవ్‌



నాందేవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్‌(నారాయణఖేడ్‌): కష్టార్జితంతో వచ్చిన సంపాదనలో తోచినంత సహాయం చేశాడు. సొంత డబ్బులతో బ్యాండ్‌ సామాగ్రి అందజేసి శభాష్‌ అనిపించుకున్నాడు. కల్హేర్‌ మండలంలోని మీర్ఖాన్‌పేటకు చెందిన కూలీ నాందేవ్‌ గ్రామానికి చెందిన బ్యాండ్‌ మేళా బృందానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశాడు. దీంతో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం మీర్ఖాన్‌పేటలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాందేవ్‌ను ఘనంగా సన్మానించారు.

మహా వృక్షానికి నిప్పు..



ఖాజాపూర్‌లో నిప్పంటుకుని కాలిపోతున్న మహావృక్షం

చిన్నశంకరంపేట(మెదక్‌): మహా వృక్షానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన సంఘటన చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌ గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని ఖాజాపూర్‌ ప్రాథమికోన్నత పాఠశాల వెనకాల ఉన్న జావిద్‌కు చెందిన చింతచెట్టుకు నిప్పు పెట్టారు. ఎవరైన సిగరేట్‌ కాల్చి వేశారా? లేక కావాలని నిప్పు పెట్టారో తెలియాల్సి ఉంది. కానీ అగ్గికి మండిపోతున్న వృక్షానికి ఎండలు తోడై మంటలు వేగంగా వ్యాపించి నెలకొరిగే స్థితిలో చేరింది. విషయం గమనించిన సర్పంచ్‌ నాగలక్ష్మి రామాయంపేట ఫైర్‌ అధికారులకు సమాచారం చేరవేయగా ఫైర్‌ఇంజన్‌ వచ్చి మంటలను ఆర్పింది. అప్పటికే పూర్తిగా కాలిపోతున్న మహావృక్షం కిందపడితే ఇబ్బందులు ఎదురవుతాయనే భావంతో స్థానికులు చెట్టును తొలగించారు.

నేత్రపర్వంగా పానీహటీ.. చిదా దహీ ఉత్సవం



విశేష అలంకరణలో బలరామకృష్ణులు

సంగారెడ్డి టౌన్‌: సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో ఆదివారం హరే కృష్ణ మూమెంట్‌ ఆధ్వర్యంలో పానీ హటీ.. చిదా దహీ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. హరే కృష్ణ మూమెంట్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు శ్రీమాన్‌ సత్యగౌరచంద్ర దాస ప్రభూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బలరామకృష్ణులకు పంచామృతాలతో అభిషేకాలు, అటుకులు, పెరుగుతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో హరేరామ హరేకృష్ణ ట్రస్ట్‌ సభ్యులు, వైకుంఠపుర ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ కృషి అభినందనీయం



జోగిపేట: ఎస్‌ఐ సామ్యానాయక్‌కు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌

ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌

జోగిపేట(అందోల్‌): రక్తదానం.. ప్రాణదానమని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ అన్నారు. ఆదివారం జోగిపేటలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు రక్తదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా వల్ల మన దేహంలోని రక్తం శుద్ధి అవుతుందన్నారు. ప్రజలతో మమేకమై పోలీసు అధికారులు విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించినందుకు గాను పోలీసు అధికారులను సిబ్బందిని, యువకులను అభినందించి పండ్లను అందజేశారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, మున్సిపల్‌ చైర్మన్‌ మల్లయ్య, సర్పంచ్‌ నర్సింహరెడ్డి, నాయకులు వీరేశం, వెంకటేశం, ఎస్‌ఐలు సామ్యానాయక్‌, విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

జోగిపేట(అందోల్‌): అందోల్‌ పెద్ద చెరువు కట్ట సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ అన్నారు. ఆదివారం చెరువు కట్ట సుందరీకరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందోల్‌ పెద్ద చెరువు కట్ట సుందరీకరణకు రూ.2.55 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో కట్టపై వాకింగ్‌ ట్రాక్‌, మురికి కాలువల నిర్మాణంతో పాటు ఇతరత్రా పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ ఇన్‌చార్జి ఏఈ విఠోబా, మాజీ మార్కెట్‌ చైర్మన్‌ నారాయణ, కాంట్రాక్టర్‌ నాగిరెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు వెంకటేశం, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహేందర్‌ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతూ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లలితాసోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెల్లాపూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మల్లెపల్లి లలితాసోమిరెడ్డి తెలిపారు. ఆదివారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని లెల్లాపూర్‌ నైబర్‌హుడ్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చర్‌పర్సన్‌ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మున్సిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్‌ నిషేధాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ఆదేవిధంగా తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సాంప్రదాయ ఇంధన వనరుల అధికారి మాణిక్యం, మన్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌, కౌన్సిలర్‌ శ్రీశైలం, తెల్లాపూర్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు దేవేందర్‌ యాదవ్‌, ముప్ప ఇంద్రప్రస్థ కమిటీ అధ్యక్షులు మదన్‌, నాయకలు ఉమేష్‌ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురి అరెస్ట్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిని అరెస్ట్‌ చేసినట్టు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గ్రామానికి చెందిన బక్కనగారి యాదగిరి ధాన్యాన్ని మే 21న ఆరబోశారు. ఈ కుప్పపై టార్పాలిన్‌ కప్పుతుండగా, అదే గ్రామానికి చెందిన బొండ్ల సురేశ్‌, దిడ్డి కిషన్‌, మహిపాల్‌లు పాత పగలు దృష్టిలో పెట్టుకుని రైతు యాదరిగిపై దాడికి పాల్పడ్డారు. గాయాలపాలైన అతణ్ని చికిత్సనిమిత్తం గాంధీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

చేర్యాల(సిద్దిపేట): అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన పట్టణ కేంద్రంలో అంబేద్కర్‌ నగర్‌ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన భూమిగారి దేవమ్మ(75) కుటుంబ సభ్యులు మండలంలోని వీరన్నపేటలో జరిగే బొడ్రాయి ప్రతిష్ఠ, దుర్గమ్మ పండగకు వెళ్లారు. మతిస్థిమితం సరిగాలేని కుమారుడితో ఇంటి వద్ద ఉన్న దేవమ్మ ఆదివారం ఉదయం చూసేసరికి మరణించి ఉంది. రక్తస్రావమై ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఐ సత్యానారాయణరెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి డాగ్‌ స్క్వాడ్‌ను పిలిపించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా కొన్ని నెలల క్రితం మద్దూరు మండలం గాగిల్లాపూర్‌ శివారులో మృతురాలి మనుమడు అనుమానాస్పదస్థితిలో చనిపోయాడు. ప్రస్తుతం దేవమ్మ కూడా ఇలాగే మృతి చెందడం చర్చనీయాంశమైంది.

చికిత్స పొందుతున్న ఇద్దరు..

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి గాంధీలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు కొత్తోజీ బ్రహ్మాచారి(58) అనే వ్యక్తి ఈ నెల 1న పని నిమిత్తం జగదేవ్‌పూర్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వట్టిపల్లి గ్రామ సమీపంలోని రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే గాంధీకి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య నలుగురు కుమారులు ఉన్నారు. ఎస్‌ఐ కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెల్దుర్తి(తూప్రాన్‌): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘన మండలంలోని హస్తాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..పందుల నర్సింలు(32) తన భార్య సుమలతతో హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం నర్సింలు బీపీ ఎక్కువై పడిపోయాడు. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సింలు ఆదివారం మృతి చెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్‌: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బీడీఎల్‌ పీఎస్‌ ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామ శివారులోని ఓఆర్‌ఆర్‌ నుంచి వెళ్లే 100 ఫీట్ల రోడ్డుకు వేప చెట్టు కింద ఓ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి బంధువులు బీడీఎల్‌ పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

పలువురికి గాయాలు

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని ప్రథమ చికిత్స కోసం ఆస్పత్రులకు తరలించారు. రెండు కార్లు ఢీ కొన్న ఘటనలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



యాదగిరి (ఫైల్‌)

దుబ్బాక: బైక్‌ అదుపు తప్పడంతో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. ఈ ఘటన దౌల్తాబాద్‌ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామంలో ఆదివారం నాడు జరిగింది. దౌల్తాబాద్‌ ఎస్‌ఐ చైతన్య కుమార్‌ రెడ్డి వివరాల ప్రకారం. చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన చిన్నమొల్ల యాదగిరి(46) ఆదివారం తన బైక్‌పై పొలం వద్దకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా బైక్‌ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యాదగిరికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆయనను గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి కొడుకు శ్రీకాంత్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 అంబులెన్స్‌ సిబ్బంది

బైక్‌ అదుపు తప్పడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని పాత ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఆదివారం జరిగింది. అంబులెన్స్‌ సిబ్బంది వివరాల ప్రకారం మున్సిపల్‌ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన కొండె సుమంత్‌ దుబ్బాక మీదుగా చీకోడ్‌ గ్రామం వైపు వెళ్తుండగా బైక్‌ అదుపు తప్పింది. ప్రమాదంలో రోడ్డు పక్కన కాలువలో పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌ సిబ్బంది ఎల్లప్ప, కనకరాజు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌పై నుంచి పడి వృద్ధుడు..

తొగుట(దుబ్బాక): బైక్‌ అదుపుతప్పి వంతెనను ఢీకొన్న ఘటనలో వృద్ధుడు మరణించాడు. ఈ ఘటన తొగుట శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. రాయపోల్‌ మండలం తిమ్మక్కపల్లికి చెందిన కొండాపురం రవి తండ్రి రామయ్య (82)తో కలిసి మండలంలోని పెద్ద మాసాపల్లిలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి బయలుదేరారు. తొగుట శివారులో ఒర్రె వద్ద బైక్‌ అదుపుతప్పి వంతెన గోడను ఢీ కొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రామయ్య మృతిచెందాడు. మృతుడి మనవడు నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

సంగారెడ్డి టౌన్‌: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ఆదివారం బీదర్‌ నుంచి హైదరాబాద్‌కు తన కుటుంబ సభ్యులతో ఆటోలో వెళ్తున్నాడు. హోప్‌ న్యూరో ఆస్పత్రి ఎదురుగా ఆటోను కంటెయినర్‌ ఢీ కొట్టడంతో స్వల్పంగా గాయపడ్డారు. వారిని వెంటనే స్థానికులు హోప్‌ న్యూరో ఆస్పత్రికి తరలించారు.

రెండు కార్లు ఢీ..



గాయపడిన సావిత్రి

నారాయణఖేడ్‌: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘట నారాయణఖేడ్‌ పట్టణ శివారులోని డబుల్‌బెడ్‌ రూం ఇళ్ల సమీపం నిజాంపేట్‌– నారాయణఖేడ్‌–బీదర్‌ 161బీ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ప్రమాదంలో ఓ కారులో కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన భార్యాభర్తలు సావిత్రి (33), దత్తాత్రిగౌడ్‌ (35)కు తీవ్రగాయాలు, డ్రైవర్‌ శ్రీనివాస్‌కు స్వల్పగాయాలు తగిలాయి. మరో కారులో ప్రయాణిస్తున్న నిజామాబాద్‌ జిల్లా సదాశివనగర్‌ మండలానికి చెందిన రాములు (40), సంజీవ్‌ (40) గాయపడ్డారు. అలాగే ఈ ఘటనలో మరో ముగ్గురికి స్వల్ప గయాలు తగిలాయి. వారిని 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్‌ ఏరియా ఆస్పత్రికి తీసుకు రాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు.



నారాయణఖేడ్‌: ప్రమాదంలో దెబ్బతిన్న కారు

టిప్పర్‌ ఢీకొని..



సారయ్య మృతదేహం

చేగుంట(తూప్రాన్‌): టిప్పర్‌ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాసాయిపేట మండలం రామంతపూర్‌ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శనివారం రాత్రి సమయంలో నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని టిప్పర్‌ ఢీకొనగా అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అతని వద్ద దొరికిన ఆధార్‌ కార్డుతో వరంగల్‌జిల్లా కేశసముద్రానికి చెందిన బొంత సారయ్య(40)గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి బంధువులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.